

సమన్వయంతోనే అభివృద్ధి

ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రుల భాగస్వామ్యం పెరగాలని విద్యా కమిషన్ చైర్మన్ మురళి ఆకాంక్షించారు.

8లో▸



'వినియోగం' మారినా..

హైడ్రా-2.0' తన పంథాను పూర్తిగా మార్చుకుంది. కూల్చివేతల విషయంలో ఆచితూచి అడుగులు వేస్తోంది.

8లో▸



ఆక్రమిస్తే చర్యలు

ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు చేసే వారిపై చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ ఎస్.వెంకటేశం హెచ్చరించారు.

8లో▸

న్యూస్‌రీల్

నేడు 'డయల్ యువర్ డీఎం'

ఆర్టీసీ ఇబ్రహీంపట్నం డీఎం వెంకటనర్సప్ప

ఇబ్రహీంపట్నం: ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోమేనేజర్ వెంకటనర్సప్ప గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 9959226141 నంబర్‌కు సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు ఫోన్ చేసి తమ సలహాలు సూచనలు అందించాలన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకుని డిపో అభివృద్ధికి సహకరించాలని డీఎం విన్నవించారు.

ఇంధన పొదుపు.. అందరి బాధ్యత

ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ జిల్లా మేనేజర్ సురేశ్‌రెడ్డి



చేగూరు జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థుల ర్యాలీ

నందిగామ: ఇంధనమే ప్రపంచానికి చోదక శక్తి అని ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ జిల్లా మేనేజర్ సురేశ్‌రెడ్డి అన్నారు. ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా గురువారం మండల పరిధిలోని చేగూరు జెడ్పీహెచ్ విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సురేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇంధనం పొదుపు చేయడం సమాజంలోని ప్రతీ ఒక్కరి బాధ్యత అన్నారు. ప్రస్తుతం ఉపయోగిస్తున్న ఇంధనంలో బొగ్గు, ముడిచమురులదే సింహభాగమని చెప్పారు. వీటి వల్ల కర్బన ఉద్గారాలు పెద్ద ఎత్తున వెలువడి వాతావరణం కలుషితమవుతోందన్నారు. దీంతో సమాజానికి ముప్పు వాటిల్లుతుందని వివరించారు. ఇంధనాలు తగ్గించుకునేందుకు పునరుత్పాదక వనరులు పెంచుకోవడం అత్యవసరమన్నారు. వారోత్సవాల్లో భాగంగా ఇంధన వనరులపై విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇంధన వనరుల అభివృద్ధి అధికారి రామకృష్ణ, హెచ్‌ఎం రాజిరెడ్డి, ఉపాధ్యాయులు హరితం, కృష్ణయ్య, నర్సింహులు, శ్రీనివాస్, వీణ, విజయ, విజయలత, అశ్విని, నీలమ్మ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

న్యూ ఇయర్ వేడుకలపై నిఘా

ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: న్యూ ఇయర్ వేడుకల్లో నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్, డ్రగ్స్, గంజాయిపై నిఘా పెట్టాలని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. ఈ మేరకు గురువారం ఆబ్కారీ భవన్‌లో రంగారెడ్డి, హైదరాబాద్ ఎక్సైజ్, ఎస్‌టీఎఫ్ బృందాలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నేటి నుంచి జనవరి మొదటి వారం వరకు ఆయా అధికారులకు సెలవులను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. అనివార్యమైతే తప్ప ఎవరూ సెలవులు పెట్టొద్దని సూచించారు. న్యూ ఇయర్ వేడుకల్లో నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను వినియోగించకుండా పటిష్ట నిఘాను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రధానంగా రైళ్లు, బస్సులు, ఇతర వాహనాల తనిఖీలను ముమ్మరం చేయాలన్నారు. ఎన్‌డీపీఎల్ మద్యం రాకుండా చూడాలని, ఈవెంట్ మేనేజర్ల కదలికలపై దృష్టి సారించాలని, నానక్‌రాంగూడ, సింగరేణి కాలనీ, ఎల్బీనగర్, కర్మన్‌ఘాట్, గోల్కొండ, పుప్పాల్‌గూడ, మణికొండ, రామకృష్ణ కాలనీలపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో జాయింట్ కమిషనర్లు ఖురేషీ, కేఏబీశాస్త్రి, డిప్యూటీ కమిషనర్ పి.దశరథ్, అడిషనల్ ఎస్పీ భాస్కర్, అసిస్టెంట్ కమిషనర్లు ఆర్.కిషన్, అనిల్‌కుమార్‌రెడ్డి, ప్రణవి, డీఎస్పీలు తుల శ్రీనివాసరావు, తిరుపతి యాదవ్, శంషాబాద్, మల్కాజ్‌గిరి, మేడ్చల్, సరూర్‌నగర్ ఎక్సైజ్ సూపరింటిండెంట్లు కృష్ణ ప్రియ, కె.నవీన్, ఫయాజోద్దీన్, ఉజ్వలరెడ్డి ఉన్నారు.

రైతులకు ప్లాట్ల పట్టాలు



ప్లాట్ల పట్టాలు అందజేస్తున్న అధికారులు

కొడంగల్ రూరల్: మెడికల్, వెటర్నరీ కళాశాలల నిర్మాణంలో భూములు కోల్పోతున్న అప్పాయిపల్లి గ్రామ రైతులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ ప్రారంభించింది. గురువారం తహసీల్దార్ విజయ్‌కుమార్, సబ్ రిజిస్ట్రార్ రవికాంత్‌లు బాధిత రైతులకు ప్లాట్ల పట్టాలు అందజేశారు. డీటీసీపీ లేఅవుట్ ద్వారా ప్రభుత్వమే రైతులకు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇస్తుందని అధికారులు వెల్లడించారు.



రేపటి నుంచి ధ్యాన మహాయోగం

- 11 రోజుల పాటు కొనసాగనున్న వేడుకలు
- తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ, విదేశాల నుంచి ధ్యానుల రాక
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు

మహేశ్వర మహాపిరమిడ్

కడ్తాల్: ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ చేపట్టే పత్రీజీ ధ్యాన మహాయోగ వేడుకలకు మహేశ్వర మహాపిరమిడ్ ముస్తాబయింది. ఈ నెల 21 ప్రారంభమయ్యే ఈ సంబురాలు డిసెంబర్ 31 వరకు 11 రోజుల పాటు కొనసాగుతాయి. ఇందుకోసం ది హైదరాబాద్ స్పిరుచ్యువల్ సొసైటీ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ధ్యానులకు వసతి గృహాలు, కుటీరాలు

12 సంవత్సరాలుగా డిసెంబర్ నెలలో వివిధ ప్రాంతాల నుంచి ధ్యానులు ఇక్కడికి తరలి వచ్చి కార్యక్రమంలో పాల్గొంటున్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ, విదేశాల నుంచి వచ్చే వేలాది మంది మధ్య పత్రీజీ ధ్యాన మహాయోగాలను వైభవంగా నిర్వహించేందుకు ది పిరమిడ్ ట్రస్ట్ స్పిరిచ్యువల్ సొసైటీ మూవ్‌మెంట్ హైదరాబాద్ ఆధ్వర్యంలో చకచకా ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ధ్యానులకు ప్రత్యేక వసతి, ఉచిత భోజన సదుపాయాలు కల్పించనున్నారు. ఉచిత అన్నదాన కేంద్రం, శాశ్వత గదులతో పాటు, తాత్కాలిక వసతి గృహాలు, కుటీరాలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి రోజు ధ్యానం చేసేందుకు వీలుగా భారీ సభా ప్రాంగణం, ప్రత్యేక అలంకరణతో పెద్ద వేదిక తయారు చేశారు. పత్రీజీ ధ్యాన మహాయాగంలో భాగంగా ప్రతీ రోజు పత్రీజీ వీడియో సందేశం, ప్రముఖ ధ్యాన గురువులు, ఆధ్యాత్మిక వేత్తల, పిరమిడ్ మాస్టర్ల ఆధ్యాత్మిక సందేశాలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



ధ్యాన సభా వేదిక ప్రాంగణం

కార్యక్రమ వివరాలు

ఉదయం 5గంటల నుంచి 8.30గంటల వరకు	పత్రీజీ వీడియో సందేశాలు, సామూహిక వేణుగాణ ధ్యానం, అఖండ ధ్యానం
ఉదయం 10గంటల నుంచి రాత్రి 9గంటల వరకు	ధ్యాన గురువుల సందేశాలు, గురుసమ్మేళనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆధ్యాత్మిక ప్రసంగాలు, సంగీత ధ్యానం

అడ్రస్‌లేని ఆస్పత్రికి శంకుస్థాపన!

భూమి కేటాయించకుండానే శిలాఫలకాలు

- తుక్కుగూడ, ఆర్సీఐ, బడంగ్‌పేట్‌లలో వింత పరిస్థితి
- ప్రజాప్రతినిధులు, అధికారుల తీరుపై విమర్శల వెల్లువ

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఏదైన భవనం నిర్మించాలంటే ముందు నిర్దేశిత ప్రాంతంలో అవసరమైన విస్తీర్ణంలో భూమిని ఎంపిక చేస్తాం. ఆ తర్వాత ఓ శుభ ముహూర్తం చూసుకుని శంకుస్థాపన చేస్తాం. కానీ వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్మించ తలపెట్టిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు భూమిని ఎంపిక చేసి, కేటాయింపులు జరపకుండానే సాక్షాత్తు జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు చేతుల మీదుగా భవన నిర్మాణానికి శంకుస్థాపనలు చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారుల అనాలోచిత నిర్ణయాలకు తోడు.. ప్రజాప్రతినిధుల తొందర పాటు చర్యల వల్ల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ తలపట్టుకోవాల్సిన దుస్థితి తలెత్తింది.

అన్నింటికి ఒకే చోట శిలాఫలకాలు

మహేశ్వరం నియోజకవర్గంలోని జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌సీఐ రోడ్డు సహా బడంగ్‌పేట్, తుక్కుగూడలో 15వ ఆర్థిక సంఘం నిధులతో పట్టణ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో భవనానికి రూ.1.43 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేసింది. ఆయా ఆస్పత్రి భవనాలకు అవసరమైన భూమిని మాత్రం నేటికీ ఎంపిక చేయలేదు.



ప్రజాపాలన ఉత్సవాల్లో ఆవిష్కరించిన శిలాఫలకం(ఫైల్)

ప్రజాపాలన ఏడాది ఉత్సవాల్లో భాగంగా నవంబర్ 30న ఆయా భవనాలకు ఏకంగా శంకుస్థాపనలు చేయడం విశేషం. తుక్కుగూడలో ఓ రోడ్డుకు శంకుస్థాపన చేసిన చోటే.. ఆయా ఆస్పత్రి భవనాలకు సంబంధించిన శిలాఫలకాలను ఏర్పాటు శంకుస్థాపనలు చేయడం చర్చనీయాంశంగా మారింది.

ఆంతర్యం ఏమిటో..?

భూమిని కేటాయించకుండా ఆగమేఘాల మీద శిలాఫలకాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏమొచ్చిందనే విమర్శలు లేకపోలేదు. ఆ తర్వాత ఆయా శిలఫలకాలను అక్కడి నుంచి మున్సిపల్ ఆఫీసులకు తరలించడం విశేషం. ఇప్పటికే శంకుస్థాపనలు చేసిన భవనాలకు, రోడ్లకే దిక్కు లేదు. నిధుల లేమి సహా ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో ఆయా నిర్మాణాలు నేటికీ ప్రారంభం కాలేదు. దీనికి తోడు ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన శిలాఫలకాలు అటు వైపు వెళ్లేవారిని వెక్కిరిస్తున్నట్లుగా ఉన్నాయి. కేవలం నియోజకవర్గంలోని ఒకరిద్దరి రాజకీయ ఆధిపత్యం, లబ్ధి కోసమే ఇలాంటి అవగాహన లేని చర్యలు చేపడుతున్నట్లు స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఇలాంటి చర్యలను నియంత్రించాల్సిన జిల్లా అధికారులు సైతం ఏమీ చేయలేక మిన్నకుండిపోతున్నారు. ప్రజాప్రతినిధుల తొందరపాటు చర్యల వల్ల ప్రజల్లో తాము అభాసుపాలు కావాల్సి వస్తుందని ఆయా విభాగాల అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిజానికి ఆరోగ్య కేంద్రం మంజూరు చేసిన వెంటనే అనువైన భూమిని ఎంపిక చేయాలి. కానీ ఇవేవీ చేయకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి ఏకంగా శిలాఫలకాలు ఏర్పాటు చేసి, వాటికి శంకుస్థాపనలు చేయడం వివాదాస్పదంగా మారింది.



క్రీడాకారులతో గురుకులాల అధికారులు, పోలీసు అధికారులు తదితరులు

పట్టుదల ఉంటే విజయాలు వెన్నంటే

- గురుకుల విద్యాలయాల సంస్థ అదనపు కార్యదర్శి కిరణ్మయి
- గురుకులాల 10వ రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు ప్రారంభం

షాద్‌నగర్ రూరల్: క్రీడలతో విద్యార్థుల ఆత్మస్థైర్యం పెంపొందుతుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకులాల ఆర్థిక విభాగం కార్యదర్శి కిరణ్మయి అన్నారు. గురువారం సాంఘిక సంక్షేమ గురుకులాల పదవ రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలు ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కమ్మదనం బాలికల గురుకుల పాఠశాలలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కిరణ్మయి జాతీయ జెండాను ఆవిష్కరించి పోటీలను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన ఆర్ట్ గ్యాలరీని తిలకించి అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. కృషి, పట్టుదల ఉంటే విజయాలు వెన్నంటే ఉంటాయన్నారు. లక్ష్య సాధనకు ప్రణాళికలు రూపొందించుకుని శ్రమిస్తే విజయ తీరాలు చేరుకోవడం సులువు అన్నారు. క్రీడా పోటీలతో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయన్నారు.

గురుకులాలల అభివృద్ధికి పెద్దపీట

ఏసీపీ రంగస్వామి మాట్లాడుతూ.. ప్రభుత్వం గురుకులాల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. విద్యార్థులకు కావాల్సిన వసతులను కల్పించడంతో పాటుగా నాణ్యమైన విద్యను అందిస్తోందన్నారు. విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుని నవభారత నిర్మాణంలో భాగస్వాములు కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ స్టేట్ ఆఫీసర్ భీమయ్య, మల్టీజోనల్ ఆఫీసర్ రజని, జోనల్ ఆఫీసర్లు నిర్మల, ఫ్లొరెన్స్‌రాణి, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ఆఫీసర్ వివేకానంద, పట్టణ సీఐ విజయకుమార్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్‌అలీఖాన్ బాబర్, డైరెక్టర్ కరుణాకర్, నాయకులు బాల్‌రాజ్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, ఇబ్రహీం, అంజయ్యగౌడ్, నవీన్, సందీప్‌గౌడ్, గురుకులాల పీడీలు, పీఈటీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పెంజర్లలో దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

సర్వే పకడ్బందీగా చేపట్టాలి

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలించిన కలెక్టర్ నారాయణరెడ్డి

కొత్తూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం మండల పరిధిలోని పెంజర్ల గ్రామంలో అధికారులు చేపడుతున్న సర్వేను కలెక్టర్ నారాయణరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అర్హుల ఎంపికలో అనుసరించాల్సిన విధి విధానాలను అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు వివరించారు. అనంతరం గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పదోతరగతి విద్యార్థులకు సలహాలు ఇచ్చారు. ఇష్టపడి చదువుతేనే ఉన్నతంగా రాణిస్తారని చెప్పారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రం, ఆరోగ్య సబ్‌సెంటర్‌ను సందర్శించి చిన్నారులతో మాట్లాడారు. పెంజర్లలోని సబ్‌సెంటర్ పరిధిలో రికార్డులను పరిశీలించిన ఆయన ఎక్కువ అబార్షన్ కేసులు నమోదైనట్లు గుర్తించారు. వివరాలను సమర్పించాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట ఎంపీడీఓ అరుంధతి, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎంపీఓ విజయలక్ష్మి, పలు శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహేశ్



పీఎస్‌లో మాల మహానాడు నాయకులు

షాద్‌నగర్‌రూరల్: అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని అడ్డుకోలేరని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహేశ్ అన్నారు. దళిత వర్గీకరణకు వ్యతిరేకంగా మాలల ఐక్య కార్యాచరణ సమితి అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా గురువారం మాల మహానాడు నాయకులను పోలీసులు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ.. రాజ్యాంగంలోని 341వ ఆర్టికల్ దళిత వర్గీకరణకు వ్యతిరేకమన్నారు. రాజకీయ పార్టీల కక్ష సాధింపు, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో మాలలకు అన్యాయం జరుగుతోందన్నారు. అసెంబ్లీ ముట్టడికి తరలివెళ్తున్న మాలలను అక్రమంగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమని అన్నారు. వర్గీకరణను అడ్డుకుని తీరుతామన్నారు. అరెస్టు అయిన వారిలో మాలమహానాడు తాలూక కమిటీ సలహాదారులు జనార్దన్, వెంకటయ్య, తాలూక కన్వీనర్ బుచ్చయ్య, కో కన్వీనర్ అర్జున్‌కుమార్ తదితరులు ఉన్నారు.

మోండా మార్కెట్‌లో అగ్ని ప్రమాదం

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్‌లోని మోండా మార్కెట్‌లో గురువారం జరిగిన అగ్నిప్రమాదంలో 5 దుకాణాలు దగ్ధమయ్యా యి. ఈ ఘటనలో దాదాపు రూ.20 లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లింది. మార్కెట్ పోలీసులు తెలిపిన ప్రకారం.. తెల్లవారుజామున మార్కెట్‌లోని కొబ్బరికాయలు, కిరాణా దుకాణాల్లో మంటలు రావడాన్ని గుర్తించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి, మార్కెట్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది ఫైర్ ఇంజన్ సహాయంతో మంటను అదుపులోకి తెచ్చారు. కాగా అప్పటికే రెండు కొబ్బరికాయల దుకాణాలు, ఒక పూజా సామగ్రి, ప్లాస్టిక్ దుకాణం, కిరాణా షాప్ కాలి బూడిదయ్యాయి. ఈ ఘటనలో సుమారు రూ.20 లక్షలకు పైగా ఆస్తినష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. చలిమంట కారణంగా ప్రమాదం జరిగి ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు.

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

అగ్ని ప్రమాదం విషయం తెలియడంతో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితులను పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాధితులకు అండగా ఉంటూ ప్రభుత్వం తరఫున సహాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. మార్కెట్లో కొందరు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

నచ్చిన రంగాల్లో రాణించాలి

- నవోదయ విద్యాలయ సమితి జాయింట్ సెక్రటరీ జ్ఞానేంద్రకుమార్
- కన్హాలో ప్రారంభమైన జాతీయ సమైక్యత సమ్మేళనం

నందిగామ: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, కళలు, సాంస్కృతిక రంగాల్లో రాణించాలని నవోదయ విద్యాలయ సమితి జాయింట్ సెక్రటరీ జ్ఞానేంద్రకుమార్ పిలుపు నిచ్చారు. గురువారం కన్హా శాంతి వనంలో నవోదయ విద్యాలయ జాతీయ సమైక్యతా సమ్మేళనం 2024- 25 నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోని నవోదయ విద్యాలయాలకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. వీటిలో చదివిన ఎంతో మంది అత్యున్నత స్థానాలకు ఎదిగారని తెలిపారు. చదువుతో పాటు ఇష్టమైన రంగాలను ఎంచుకుని, ప్రతిభ చాటాలని విద్యార్థులకు సూచించారు. నవోదయ సమ్మేళనంలో కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు విస్తరించిన సుమారు 661 నవోదయ విద్యాలయాలకు చెందిన 436 మంది విద్యార్థులు పాల్గొంటున్నారు. ఆయా రాష్ట్రాల విద్యార్థులు ప్రదర్శించిన క్లాసికల్, జానపద నృత్యాలు, సంగీత కచేరి, కూచిపూడి, టాయ్స్ ఆర్ట్స్, పెయింట్ ఎగ్జిబిషన్, తబలా వాయిద్యం అలరించాయి. కార్యక్రమంలో ఏపీ రూరల్ డెవలప్‌మెంట్ సెక్రటరీ, రిటైర్డ్ ఐఏఎస్ మురళి, నవోదయ విద్యాలయ సమితి డిప్యూటీ కమిషనర్ గోపాలకృష్ణ, ఎన్‌వీఎస్ ఢిల్లీకి సంగీత తదితరులు పాల్గొన్నారు.



జాతీయ సమైక్యత సమ్మేళనాన్ని ప్రారంభిస్తున్న ఎన్‌వీఎస్ జాయింట్ సెక్రటరీ జ్ఞానేంద్ర కుమార్

ఆర్థికాభివృద్ధిలో విద్య పాత్ర కీలకం

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

రాంగోపాల్‌పేట్: దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందడంలో విద్య కీలక పాత్ర పోషిస్తుందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. గురువారం సికింద్రాబాద్‌లోని సెయింట్ మేరీస్ సెంటినరీ కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న జాతీయ స్థాయి మేనేజ్‌మెంట్ ఎంప్రెసా-24ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఉన్నత విద్యాధికులతో పాటు మేధో శక్తి పెరిగితే ఆ దేశం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తుందన్నారు. దేశంలో భిన్న మతాలు, ప్రాంతాలు, భాషలు ఉన్నా మనమంతా భారతదేశ పౌరులమేనన్నారు. మనిషి అంతరిక్షంలోకి వెళ్తున్నా.. ఎలా జీవించాలో నేర్చుకోవడం లేదని మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయ్ అన్నచందంగా ప్రస్తుత సమాజం ఉందన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ ఆర్చ్ బిషప్, కార్డినల్ పూల ఆంథోని, కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి.ఆంథోని వినయ్, ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రవీణ్, ఉస్మానియా యూనివర్సిటీ మేనేజ్‌మెంట్ కళాశాల డీన్ ప్రొఫెసర్ శ్రీరాములు, విద్యాసాగర్, మిన్నీ మ్యాథ్యూ, చేతన్ శ్రీవాత్సవ్, కున్నుంకల్ తదితరులు పాల్గొన్నారు.



గవర్నర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న కార్డినల్ పూల ఆంథోని

ఫుట్‌పాత్‌లు ఆక్రమిస్తే చర్యలు

ట్రాఫిక్ సీఐ వెంకటేశం



ఫుట్‌పాత్‌పై విక్రయిస్తున్న దుకాణాలను తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

చేవెళ్ల: ఫుట్‌పాత్‌లు ఆక్రమిస్తే చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ ఎస్.వెంకటేశం హెచ్చరించారు. గురువారం ఆయన తన సిబ్బందితో కలిసి మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్‌స్టేషన్ నుంచి శంకర్‌పల్లి చౌరస్తా వరకు రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లు ఆక్రమించిన వ్యాపారుల దుకాణాలను తొలగించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ మాట్లాడుతూ.. పలు మార్లు హెచ్చరించినా వ్యాపారాలు కొనసాగిస్తూ ట్రాఫిక్ ఇబ్బందులకు కారణమవుతున్నారన్నారు. టాఫిక్ రూల్స్ ప్రకారం ఫుట్‌పాత్‌లపై ఎలాంటి వ్యాపారాలు చేపట్టవద్దని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించా రు. సీఐ వెంట ఏఎస్ఐలు ఎం.అశోక్, చందర్‌నాయక్, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

అతివేగంతో ప్రమాదం

డివైడర్ మధ్యలో స్తంభాన్ని ఢీకొట్టడంతో డ్రైవర్‌కు గాయాలు



ప్రమాద స్థలిలో దెబ్బతిన్న కారు

మొయినాబాద్: టిప్పర్‌ను ఎడమవైపు నుంచి ఓవర్ టేక్ చేస్తున్న కారు డివైడర్ మధ్యలో స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ఘటన గురువారం హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై గండిపేట చౌరస్తా సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం మధ్యాహ్నం 1.30గంటల ప్రాంతంలో హైదరాబాద్ నుంచి మొయినాబాద్ వైపు అతివేగంగా వెళ్తున్న కారు డ్రైవర్ టిప్పర్‌ను ఎడమ వైపు నుంచి ఓవర్‌టేక్ చేశాడు. అదే వేగంతో ముందుకెళ్లి రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌పై ఉన్న వీధిదీపాల స్తంభాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో స్తంభం కారుపై కూలడంతో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం కారణంగా భారీగా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది.

సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించాలి

- ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాల్‌నాయక్



మాట్లాడుతున్న రాంబాల్‌నాయక్, నాయకులు

షాద్‌నగర్: గిరిజనుల ఆరాధ్య దైవం అయిన సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని లంబాడీ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు రాంబాల్‌నాయక్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని దేవీ గ్రాండ్ హోటల్‌లో ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు చందునాయక్ ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సంఘం రాంబాల్‌నాయక్ మాట్లాడుతూ.. సంత్ సేవాలాల్ మహారాజ్ గిరిజనుల ఆరాధ్య దైవం అని అన్నారు. మహారాజ్ జయంతిని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేందుకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చి ఏళ్లు గడుస్తున్నా గిరిజనులు మాత్రం అన్ని రంగాల్లో వెనకబడే ఉన్నారన్నారు. గిరిజనులు సామాజిక, ఆర్థిక, విద్యారంగాల్లో మరింత అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం ప్రోత్సాహాన్ని అందించాలని కోరారు. అదేవిధంగా పట్టణాలు, గ్రామాలకు దూరంగా ఉండే తండాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. చాలా తండాల్లో కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడంతో గిరిజనులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా గిరిజనుల మాతృబాష అయిన గోరోబోలీని రాజ్యాంగంలోని 8వ ఆర్టికల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గత పాలకులు గిరిజనుల మాతృభాషకు చట్టబద్ధత కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. ఈ నెల 29న పట్టణంలో ఎల్‌హెచ్‌పీఎస్ నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు మిట్టునాయక్, మంగులాల్‌నాయక్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

పహాడీషరీఫ్: మహిళ అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. గురువారం పోలీసులు తెలిపిన ప్రకారం.. రంగనాయకుల కాలనీకి చెందిన జటావత్ జమ్మా(50) అనారోగ్యంతో బాధపడుతూ కూతురు రోజా వద్ద నివాసం ఉంటుంది. ఈ నెల 18న ఇంట్లో చెప్పకుండా వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. రోజా ఫిర్యాదు మేరకు పోలీసుకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పీఎస్‌లో గాని 87126 62367 నంబర్‌లో సమాచారం అందించాలన్నారు.

లారీ ఢీ కొని మహిళ దుర్మరణం

నాగోలు: బైక్‌పై రామోజీ ఫిల్మ్ సిటీకి వెళుతున్న జంటను వెనుక నుంచి లారీ ఢీ కొనడంతో ఓ యువతి మృతి చెందిన సంఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎల్‌బీనగర్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రోహిత్‌కుమార్ పాట్లే మీర్‌పేట్, అన్నపూర్ణ కాలనీలో ఉంటూ నగరంలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. మహారాష్ట్రలోని సోలాపూర్ జిల్లాకు చెందిన అతడి స్నేహితురాలు ప్రియాంక గాధే బుధవారం రోహిత్‌కుమార్ ఇంటికి వచ్చింది. ఇద్దరూ కలిసి గురువారం ఉదయం బైక్‌పై రామోజీ ఫిల్మ్ సిటీకి వెళుతుండగా ఎల్‌బీనగర్ మెట్రో స్టేషన్ సమీపంలో వెనుక నుంచి వచ్చిన కంటైనర్ లారీ వారిని ఢీకొనడంతో ఇద్దరూ కింద పడ్డారు. లారీ చక్రాలు ప్రియాంక గాధే తల మీదుగా వెళ్లడంతో తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. ఎల్‌బీనగర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించారు. రోహిత్‌కుమార్ పాట్లే ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో పోలీసు వాహనంపై దాడి

రాంగోపాల్‌పేట్: మద్యం మత్తులో ఓ మహిళ ఠాణాకు వచ్చి హంగామా చేయడమేగాక పోలీసు వాహనంపై రాయితో దాడి చేసిన సంఘటన గోపాలపురం పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం మధ్యాహ్నం మద్యం మత్తులో స్టేషన్‌కు వచ్చిన ఓ జంట ఫిర్యాదు తీసుకోవాలని పోలీసులను కోరారు. అయితే వారు మద్యం మత్తులో దురుసుగా మాట్లాడుతుండటంతో పోలీసులు బయటికి పంపారు. దీంతో సదరు మహిళ మా ఫిర్యాదునే తీసుకోవా.? అంటూ పోలీసులపై తిరగబడింది. స్టేషన్ ప్రాంగణంలో ఉన్న పోలీసు వాహనంపై రాయితో దాడి చేసి అద్దాలు పగులగొట్టింది. స్టేషన్ లోపలికి వెళ్లి ఉన్నతాధికారులపై కూడా దాడికి యత్నించడంతో ఆమెను అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సమన్వయంతోనే సంపూర్ణ అభివృద్ధి

- విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి
- ఆరుట్ల జెడ్పీహెచ్‌ఎస్(బాలుర)లో తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం



ఆరుట్లలో జెడ్పీహెచ్‌ఎస్‌లో వివరాలు సేకరిస్తున్న విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

మంచాల: విద్యాప్రమాణాలు పెరిగి అభివృద్ధి దిశగా అడుగులు పడాలంటే ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధితోనే సాధ్యమని రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరు మురళి అన్నారు. గురువారం ఆయన మండల పరిధిలోని ఆరుట్ల జెడ్పీహెచ్‌ఎస్(బాలుర) పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్థానిక నాయకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఆకునూరి మురళి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందాలంటే సరిపడా ఉపాధ్యాయులతో పాటుగా మౌలిక వసతుల కల్పన అవసరం అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రుల సమన్వయం అవసరమన్నారు. వసతులు వినియోగించుకోలేకపోతే నిరుపయోగమవడమే కాక.. దుబారా అవుతాయన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల సహకరిస్తే పాఠశాలను రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతామన్నారు. అనంతరం ఉస్మానియా వర్సిటీ అధ్యాపకులు లక్ష్మణ్, పద్మజ, ఎస్‌ఆర్‌ఐ నిర్మల మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యమవుతే పేదలకు విద్య అందడం కష్టతరమవుతుందన్నారు. ప్రైవేటు యాజమాన్యాలు విచ్చలవిడిగా ఫీజులు పెంచి సామాన్యులకు విద్యను దూరం చేస్తారని చెప్పారు. బడుగు, బలహీన వర్గాలకు ఉన్నత విద్య అందాలంటే ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలన్నారు. ఈ నెల 28న మరోమారు విద్యార్థుల తల్లిదండ్రుతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామన్నారు. పాఠశాలను ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు కావాల్సిన సమాలోచనలు చేద్దామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకట ప్రసాద్, ఎంఈఓ రాందాస్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తుల అభిప్రాయాలను సేకరించారు.

తల్లిదండ్రుల భాగస్వామ్యం పెరగాలి

యాచారం: ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రుల భాగస్వామ్యం పెరగాలని విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి ఆకాంక్షించారు. నక్కర్తమేడిపల్లి ఉన్నత పాఠశాలలో గురువారం ఆయన విద్యార్థులు, తల్లితండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిష్ణాతులైన ఉపాధ్యాయులు, ఉచిత విద్య, భోజనం, వసతులతో కూడిన నాణ్యమైన బోధన అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలలపై ఎందుకు ఆసక్తి చూపడం లేదని తల్లిదండ్రులను ప్రశ్నించారు. సర్కారీ బడుల్లో ఏ చిన్న సమస్య ఉన్నా ప్రభుత్వం నిధులు ఇస్తే తప్ప పరిష్కారం కావడం లేదన్నారు. స్కూళ్లలో మౌలిక వసతుల కల్పన కోసం తల్లిదండ్రుల నుంచి ఏటా రూ.వెయ్యి వసూలు చేసి, వారినే ఓనర్లుగా చేస్తే బాగుంటుందా..? అని అడిగారు. నక్కర్తమేడిపల్లి హైస్కూల్‌ను దత్తత తీసుకున్న అమెజాన్ సంస్థ రూ.కోటి ఖర్చు చేసి అన్ని విధాలుగా అభివృద్ధి చేయడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రైవేటు సంస్థల సహకారం అవసరమని తెలిపారు. దాతలు, స్థానికులు సైతం ముందుకు రావాలన్నారు. అనంతరం గునుగల్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఏళ్ల క్రితం నిర్మించిన పాఠశాల గదులను కూల్చవద్దని, వీటిని ఇతర పనులకు వినియోగించుకునే అవకాశం ఉంటే పరిశీలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి పాండురంగారెడ్డి, నక్కర్తమేడిపల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఉదయశ్రీ, ఉపాధ్యాయులు, తల్లితండ్రులు ఉన్నారు.

ఉపాధ్యాయులతోనే మార్పు



ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నత విద్యావంతులైన ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. అయినప్పటికీ వారి పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపుతున్నారు. వారి నుంచే మార్పు మొదలవ్వాలి.

– మారగోని మాసయ్య గౌడ్, ఆరుట్ల

మౌలిక వసతులు కల్పించాలి



ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలి. అటెండర్, వాచ్‌మెన్, స్వీపర్లు లేరు. దీంతో పాఠశాల వాతావరణం దెబ్బతింటోంది. తక్షణమే వారిని నియమించి పాఠశాలను బలోపేతం చేయాలి.

– మాద్దుల కృష్ణ, ఎస్‌ఎంసీ కమిటీ మాజీ చైర్మన్

ప్రీస్కూల్ ఏర్పాటు అవసరం



ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంలో ప్రీస్కూల్ ప్రారంభించాలి. ఐఐటీ, నీట్ వంటి పరీక్షలకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలి. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి.

– మోహన్ నాయక్, మాజీ సర్పంచ్, ఆరుట్ల

పేదరికం.. చికిత్స భారం!

- చిరు వ్యాపారికి పెద్ద ఆపద
- ఎమ్మెల్యే, దాతలు ఆదుకోవాలని అభ్యర్థన



మంచానికే పరిమితమైన రాజశేఖర్

తాండూరు టౌన్: కాలేయ సంబంధిత వ్యాధితో బాధ పడుతున్న ఓ చిరు వ్యాపారి దినదిన గండంలా కాలం వెళ్లదీస్తున్నారు. రోజుకు రూ.8 వేల విలువైన ఇంజక్షన్లు చేయిస్తే ప్రాణాలతో బయటపడే అవకాశం ఉందని వైద్యులు పేర్కొన్నారు. కానీ చుట్టుముట్టిన పేదరికంతో చికిత్స భారంగా మారిందని తాండూరు పట్టణానికి చెందిన కల్లూరు రాజశేఖర్ తన దీనగాథను వెల్లడిస్తున్నాడు. ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్నాడు.

రూ.3 లక్షలు కావాలి

పట్టణంలోని వాల్మీకినగర్‌కు చెందిన రాజశేఖర్.. భార్య సునీత, ఓ కూతురుతో కలిసి అద్దె ఇంట్లో జీవనం సాగిస్తున్నారు. జీలకర్ర, దాల్చిన చెక్క, ఇలాచీలు చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి కిరాణా దుకాణాలకు సరఫరా చేసి, వచ్చిన డబ్బులతో కుటుంబాన్ని పోషించేవారు. 2008లో ఆయనకు కాలేయ సంబంధిత వ్యాధి ప్రారంభమైంది. అప్పటినుంచి మందులు వాడుతూనే ఉన్నారు. మధ్యలో కొన్నేళ్ల పాటు కోలుకోగా, మళ్లీ రెండేళ్లుగా వ్యాధి తిరగబెట్టింది. దీంతో వ్యాపారం నిలిచిపోయి, ఆస్పత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. నిత్యం పని చేసుకుని బతికే తమకు ఇలాంటి కష్టాలు వచ్చాయని ఇంటిల్లిపాది విచారం వ్యక్తం చేస్తున్నారు. ఏడాది పాటు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స తిరిగి రూ.2 లక్షలకు పైగా ఖర్చు చేశారు. ఈక్రమంలో ఏడాదిగా ఇంటి కిరాయి సైతం చెల్లించలేక పోతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యానికి డబ్బులు లేక రెండు నెలలుగా నిమ్స్‌లో చికిత్స తీసుకుంటున్నారు. హైదరాబాద్‌కు వెళ్లి రావడానికి సైతం కిరాయి చార్జీలు లేవని వాపోతున్నారు. కొన్నాళ్ల పాటు రోజుకు రూ.8 వేల విలువైన ఇంజక్షన్లు తీసుకుంటేనే వ్యాధి నయమయ్యే అవకాశం ఉందని నిమ్స్ వైద్యులు తెలిపారు. కోర్సు పూర్తయ్యేందుకు సుమారు రూ.3 లక్షల అవుతాయని చెప్పారు. ఎవరైనా దాతలు ఆపన్నహస్తం అందించాలని రాజశేఖర్ దంపతులు దీనంగా అభ్యర్థిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి స్పందించి, ప్రభుత్వం తరపున వైద్య సాయం చేయించాలని వేడుకుంటున్నారు. దాతలు కూడా సహకరించి, ప్రాణం నిలబెట్టాలని కోరుతున్నారు. ఫోన్ నంబర్ 90592 94199 ద్వారా సహాయం చేయాలని ప్రార్థిస్తున్నారు.

తాండూరు కందులకు డిమాండ్



తాండూరు మార్కెట్‌లో కందులు

తాండూరు: తాండూరు వ్యవసాయ మార్కెట్‌లో కంది ఉత్పత్తుల కొనుగోళ్లు ఊపందుకున్నాయి. గురువారం వ్యవసాయ మార్కెట్ యార్డులో జరిగిన బిడ్డింగ్‌లో 1,341 క్వింటాళ్ల కందులకు విక్రయాలు జరిగాయి. క్వింటాలు కందులకు కనిష్ట ధర రూ.7,550, గరిష్ట ధర రూ.8,631, సగటు ధర రూ. 8,505 చొప్పున పలికాయి. గత నెల రెండో వారం నుంచి ఖరీఫ్‌లో సాగు చేసిన కంది పంట ఉత్పత్తులు మార్కెట్‌కు తరలి వస్తున్నాయి. మరోవైపు వరి ధాన్యం(సోన రకం) క్వింటాలుకు కనిష్ట ధర రూ.2,385, గరిష్ట ధర రూ.2,565, సగటు ధర రూ.రూ.2,502 చొప్పున పలికాయి. సోయా క్వింటాలుకు రూ.3,321 చొప్పున పలికాయి. దొడ్డు రకం వరి క్వింటాలుకు 2,295 చొప్పున పలికాయి. తాండూరు కందులకు మార్కెట్‌లో డిమాండ్ పలుకుతోంది. ప్రభుత్వ మద్దతు ధర కంటే అధికంగా కందులకు ధర లభిస్తోంది.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

అల్వాల్: ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. వెంకటాపురం ప్రాంతానికి చెందిన పల్లూరి జనార్దన్ (34) భవన నిర్మాణ మేస్త్రీగా పని చేస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఒంటరిగా ఉన్న జనార్దన్ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గత కొన్నాళ్లుగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నాడని..దీంతో మనస్తాపానికి లోనై ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చునని కుటుంబసభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'వినియోగం' మారినా కూల్చుడే!

- అపార్ట్‌మెంట్లలో నిబంధనల ఉల్లంఘన
- గృహావసరాలకు వాడాల్సిన భవనాలు వాణిజ్యానికి..
- ఫిర్యాదుల ఆధారంగా విచారణ చేస్తున్న హైడ్రా
- మణికొండ అల్కాపురిలో షటర్ల కూల్చివేత



అల్కాపురిలో కూల్చివేతలు



పోలీసుల బందోబస్తు

సాక్షి, సిటీబ్యూరో/మణికొండ: 'హైడ్రా–2.0' తన పంథాను పూర్తిగా మార్చుకుంది. కూల్చివేతల విషయంలో సామాన్యులకు ఇబ్బందులు రాకుండా ఆచితూచి అడుగులు వేస్తోంది. కేవలం చెరువులు, నాలాలు, పార్కులు, ప్రభుత్వ స్థలాలే కాదు.. నిబంధనల విరుద్ధంగా గృహావసరాలకు అనుమతులు తీసుకుని, వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న నిర్మాణాలపైనా చర్యలు తీసుకుంటోంది. మణికొండ పరిధిలోని అల్కాపురి టౌన్‌షిప్‌లో ఉన్న అనుహర్ మార్నింగ్ రాగా అపార్ట్‌మెంట్‌తో దీన్ని ప్రారంభించింది. ఓ ఫిర్యాదు ఆధారంగా ముందుకు వెళ్లిన హైడ్రా, స్థానిక అధికారులు దాని గ్రౌండ్ ఫ్లోర్‌లోని వ్యాపార సముదాయాలను గురువారం కూల్చేసింది.

ట్రాఫిక్ ఇబ్బందులకు కారణమవుతూ..

నగరంలోని ఎన్నో నిర్మాణాలు నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయి. పార్కింగ్‌తో పాటు ఇతర అవసరాల కోసం కేటాయిస్తూ అనుమతి తీసుకున్న, కేటాయించాల్సిన ప్రాంతాన్ని వాణిజ్య అవసరాలకు వాడేస్తున్నారు. దీంతో అటు నివాసితులకు, ఇటు ఆ మార్గంలో ప్రయాణించే వారికి ఇక్కట్లు తప్పట్లేదు. నివాసితుల వద్దకు వచ్చే విజిటర్స్‌తో పాటు ఆయా వాణిజ్య, వ్యాపార సంస్థలకు వచ్చే వినియోగదారులు తమ వాహనాలను రహదారిపై పార్క్ చేసుకుంటున్నారు. ఇది తీవ్రమైన ట్రాఫిక్ ఇబ్బందులకు కారణం అవుతోంది.

అపార్ట్‌మెంట్ వాసుల ఫిర్యాదులతో..

అనుహర్ మార్నింగ్ రాగా అపార్ట్‌మెంట్ గ్రౌండ్ ఫ్లోర్‌లో రెసిడెన్షియల్‌కు అనుమతి తీసుకుని, వ్యాపార సముదాయాలుగా మారుస్తున్నారంటూ 38 ఫ్లాట్ల నివాసితులు అధికారులకు ఫిర్యాదు చేశారు. మూడేళ్ల క్రితం నార్సింగి పోలీసు స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేశామని చెప్పారు. దీని ఆధారంగా హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్థానిక మున్సిపల్ అధికారులతో కలిసి రెండు వారాల క్రితం క్షేత్రస్థాయి పరిశీలించారు. వివిధ అభ్యంతరాల నేపథ్యంలో హైడ్రా కార్యాలయంలో ఇరుపక్షాల వారిని సమావేశపరచడంతో పాటు అపార్టుమెంట్ నిర్మాణ అనుమతులకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. దీంతో రెసిడెన్షియల్ అనుమతి పొందిన భవనంలో కమర్షియల్ నిర్మాణాలు చేపడుతున్నట్లు తేలింది. ఎలివేషన్ కారిడార్లను మూసి ఓ బ్యాంక్‌నకు అవసరమైన స్ట్రాంగ్ రూం నిర్మాణం చేయడంతో అపార్ట్‌మెంట్‌కు పగుళ్లు కూడా వచ్చినట్లు గుర్తించారు. వాహనాల బ్యాటరీ చార్జింగ్ పాయింట్ల ప్రమాదాల నేపథ్యంలో నివాసితుల ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై అనుహర్ మార్నింగ్ రాగా అపార్టుమెంట్ నిర్మాణ యజమాని హర్షవర్ధన్ రెడ్డికి సంబంధిత విభాగాలు నోటీసులు జారీ చేసినా స్పందించలేదు.

షోకాజ్ తర్వాత డిమాలిషన్ నోటీసులు..

మణికొండ మున్సిపల్ కమిషనర్ నోటీసులకు హర్షవర్ధన్‌రెడ్డి స్పందించకపోవడంతో అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఆపై డిమాలిషన్ నోటీసులు ఇస్తూ అవసరమైన సమయం ఇచ్చినా స్పందన లేకపోవడంతో హైడ్రా సమక్షంలో స్థానిక అధికారులు గురువారం కూల్చివేతలు చేపట్టారు. జీహెచ్‌ఎంసీ మినహా ఔటర్ రింగురోడ్డు పరిధిలోని అన్ని మున్సిపాలిటీలలో తెలంగాణ మున్సిపాలిటీస్ యాక్ట్ 2019 సెక్షన్ 178 (2) ప్రకారం హైడ్రాకు సమకూరిన అధికారాల ఆధారంగా కమిషనర్ కూల్చివేతలకు ఆదేశాలు జారీ చేశారు. అనుమతి లేని వ్యాపార సముదాయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటిని తొలగిస్తామని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ విషయంలో చిరు వ్యాపారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ట్రాఫిక్, స్థానికులకు ఇబ్బందులు లేకుండా వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు.

మిగతా వాటికీ వర్తింపజేయాలి..

అనుహర్ మార్నింగ్ రాగా అపార్ట్‌మెంట్ కింద ఉన్న 14 షటర్లను అధికారులు గురువారం తొలగించారు. మున్సిపాలిటీకి కమర్షియల్ పన్నులు చెల్లిస్తున్న షటర్‌లను తాము కొనుగోలు చేసి వ్యాపారాలు చేస్తున్నామని వ్యాపారులు చెబుతున్నారు. అవి కూల్చేయడం ఎంత వరకు సబబు అంటూ కూల్చివేతలను అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఇలాంటి నిర్మాణాలను మొదట్లోనే అడ్డుకోవాల్సిన అధికారులు కాలయాపన చేశారని, వారిపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలో నివాసిత అనుమతులతో వందలాది భవనాలలో వ్యాపార సంస్థలు ఏర్పాటు చేశారని, వాటిపైనా హైడ్రా చర్యలు తీసుకోవాలంటున్నారు. తాము అప్పులు చేసి, ఆస్తులు అమ్మి వ్యాపారాలు పెట్టుకున్నామని, తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.